క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

విశాఖ విద్య: మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో సెల్ ఫోన్ పోయిందనే ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన రైల్వే పోలీసులు ఫోన్‌ను సేకరించి మంగళవారం బాధితుడికి అందజేశారు. సోమవారం ఉదయం స్పెషల్ రైల్ ఎక్కే సమయంలో మొబైల్ ఫోన్ పడిపోయిందని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీనిపై రైల్వే ఏఎస్‌ఐ కేఆర్కే రావు,కానిస్టేబుల్ కె. అప్పారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని స్టేషన్ పరిసరాల్లో తనిఖీ చేశారు. ప్లాట్‌ఫారం గేటు వద్ద సెల్ ఫోన్‌ను గుర్తించారు. డిసిప్లే పగిలిపోయి ఉండగా దాన్ని పోగొట్టుకున్న వ్యక్తికి చూపించి, తగిన ఆధారాలను పరిశీలించిన తర్వాత అప్పగించారు. తన ఫోన్ లభ్యమైనందుకు బాధితుడు రైల్వే పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

పర్యావరణహితంగా దీపావళి



సాయితనుశ్రీకి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ కేవీ రమణ, బీఎస్ఆర్ ప్రతినిధులు

మురళీనగర్: దీపావళి పండగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ సూచించారు. బీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గైస్‌లో పర్యావరణహిత దీపావళిపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రేకర్లు, ఎక్కువ శబ్దాన్నిచ్చే ప్రమాదకర బాంబులు, ఇతర మందుగుండు సామగ్రి వాడొద్దని సూచించారు. బాణసంచా కాల్చడం వల్ల వెలువడే పొగ ఆరోగ్యానికి హాని చేస్తుందన్నారు. కాకర పువ్వొతులు, ఇతర బాణసంచా కాల్చినప్పుడు తప్పనిసరిగా కళ్లద్దాలు, చెప్పులు, బూట్లు ధరించాలని సూచించారు. అనంతరం 'మన దీపావళి... మన పర్యావరణం' అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాసు, తన్వీర్, సాయితనుశ్రీ మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణను బీఎస్ఆర్ ఫౌండేషన్ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎల్.కృష్ణారావు, ఎం.సుజాత, బీటీ స్వామి, జీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్ వస్తే సకాలంలో వైద్యులను సంప్రదించాలి

ఆరిలోవ: బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినవారు గోల్డెన్ అవర్స్‌గా పిలవబడే మూడు గంటలలోపు వైద్యులను సంప్రదించాలని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే సందర్భంగా విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో మంగళవారం న్యూరో విభాగంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విమ్స్ వైద్యులు సుమారు 80 మంది రోగులకు బ్రెయిన్ స్ట్రోక్, మూర్ఛ వ్యాధికి సంబంధించిన పరీక్షలు చేశారు. వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినవారికి గోల్డెన్ అవర్స్‌లోనే వైద్యం అందించాలన్నారు. అలాంటివారు తొందరగా కోలుకోవడంతో పాటు వారికి ప్రాణాపాయం తప్పుతుందన్నారు. దీనికి సంబంధించి రూ.వేలు విలువ చేసే ఇంజక్షన్లు విమ్స్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఇంజక్షన్ ద్వారా బ్రెయిన్ స్ట్రోక్ నుంచి తొందరగా కోలుకోవచ్చన్నారు. స్ట్రోక్ వచ్చినవారు మూతి వంకర తిరగడం, చేతులు బలహీనపడటం, మాట్లాడలేకపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. అలాంటి సమయంలో వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ శిబిరంలో విమ్స్ న్యూరో విభాగం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు తూచ్..!



ఎస్‌ఏడీ వద్ద ముందు జాగ్రత్తలు లేకుండానే బాణసంచా నిల్వలు

- ఇష్టారాజ్యంగా బాణసంచా విక్రయాలు
- ముందు జాగ్రత్తలు పట్టని నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు

విశాఖ విద్య: బాణ సంచా దుకాణాల నిర్వాహకులు నిబంధనలు గాలికొదిలేశారు. వ్యాపారమే లక్ష్యంగా కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకుండా భారీగా మందుగుండు సామగ్రి నిల్వలు స్టాల్స్‌లో దింపేశారు. మంగళవారం సాయంత్రం నుంచి ఎస్ఏడీ ఫ్లై ఓవర్ సమీపంలో.. అదే విధంగా గోపాలపట్నం కుమారి కల్యాణ మండపం వద్ద బాణ సంచా విక్రయాలు ప్రారంభించారు. గోపాలపట్నం పెట్రోల్ వద్ద కుమారి కల్యాణ మండపం సమీపంలో 31 స్టాల్స్, ఎస్ఏడీ వద్ద 14 దుకాణాలకు అధికారులు లైసెన్సులు జారీ చేశారు. కానీ లైసెన్సు తీసుకున్న దుకాణం పక్కనే మరో స్టాల్‌ను అనధికారికంగా ఏర్పాటు చేశారు. దుకాణం ఏర్పాటు చేసిన చోట ముందు జాగ్రత్తలు ఏమాత్రం తీసుకోలేదు. దుకాణం మధ్య మూడు అడుగులు దూరం ఉండాలనే నిబంధనలను పాటించలేదు. ఎస్ఏడీ సెంటర్లో ఇలా కనిపిస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దుకాణాలపైకప్పును ఇనుప రేకులతో కప్పడంతో పాటు వాటికి విద్యుత్ వైర్లు తగులుతుండటంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటికి సమీపానే అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. ఇలాంటి చోట ఎలా అనుమతులు ఇచ్చారని ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగినంత నీరు, ఇసుక వంటి వాటిని సిద్ధంగా ఉంచిన తర్వానే మందు గుండు సామగ్రి పెట్టాల్సి ఉన్నా.. ఇక్కడ అలాంటి నిబంధనలు పాటించలేదు. ఎస్ఏడీ సెంటర్‌లో దుకాణాల వద్ద నీళ్ల డ్రమ్ములు ఖాళీగా కనిపిస్తున్నాయి. సిండికేట్‌గా ఏర్పడిన దుకాణదారులు భారీగా ధరలు పెంచేసి అమ్మకాలు చేస్తున్నారు. కనీస నిబంధనలు పాటించుకున్నా అధికారులు వీరిని హెచ్చరించకపోవడంతో లోపాయి కారీ ఒప్పందాలు ఏమైనా జరిగాయా..? అనే ప్రచారం సాగుతోంది. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేసే కంటే ఇలాంటి వాటిపై ముందుగానే దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్ వైర్లు వేలాడుతున్న దృశ్యం



నీరు లేని ఖాళీ డ్రమ్ములు

పగటి పూట వెలుగులు

నిర్లక్ష్యం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని పలు వీధుల్లో వేసిన ఎల్ఈడీ లైట్లు పగటిపూట కూడా వెలుగుతూనే ఉంటున్నాయి. దీనిపై సిబ్బందికి చెప్పినా వారు స్పందిచడం లేదు. గాంధీజీవీధి,మల్కాపురంలో వీధి లైట్లు ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణను పట్టించుకోక పోవడంతో పగలూ రాత్రి వెలుగుతూనే ఉన్నాయి. విషయాన్ని జీవీఎంసీ విద్యుత్ సిబ్బందికి చెప్పినా వారు స్పందన లేదని ఆయా ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు.



మల్కాపురం ఏరియాలో పగటి పూట వెలుగుతున్న వీధిలైటు

జింక్ శివాలయం రోడ్డుకు మోక్షం

స్ఫూర్తి

మల్కాపురం: ఎట్టకేలకు జింక్ శివాలయం రోడ్డుకు మోక్షం కలిగింది.కార్తీక మాసం పుణ్యమా అని ఇక్కడ సీసీ రోడ్డు వేయడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జింక్ నుంచి మింది వెళ్లే మార్గంలో కొండపై శివాలయం ఉంది.అతి పురాతనమైన ఈ ఆలయానికి ఏటా కార్తీకమాసం ,మహా శివరాత్రి వంటి సందర్భాల్లో వేలాదిగా భక్తులు వస్తుంటారు. అలాంటి ఆలయానికి కొండపైకి వెళ్లే సీసీ మార్గం శిథిలావస్థలో ఉంది. ఈ మార్గానికి మోక్షం కల్పించాలని ఆలయ కమిటీ నిర్వాహకులు అధికారులు, పాలకులకు మొర పెట్టుకున్నారు.ఫలితం లేకపోవడంతో ఆలయానికి సంబంధించిన సుమారు రూ.2.50 లక్షలతో 105 మీటర్ల వరకు సీసీ రోడ్డు వేయించారు.దీంతో ఆలయానికి వచ్చే భక్తుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



జింక్ శివాలయానికి వెళ్లే మార్గంలో వేసిన సీసీ రోడ్డు

వెలుగుల పండగకు ధరల షాక్

- పూజాసామగ్రి ధరలకు రెక్కలు
- మండుతున్న బాణసంచా రేట్లు
- నెలాఖరు కావడంతో దీపావళి పండగపై ప్రభావం

మల్కాపురం: వెలుగుల దీపావళి వచ్చేసింది. పూజాసామగ్రి, బాణసంచా కొనుగోళ్లతో ప్రధాన కూడళ్ల సందడిగా మారాయి. దివ్వెలు కొట్టేందుకు చెరకు గడలు, గోగు పుల్లలు కొనుగోలు చేశారు. మట్టి ప్రమిదలు జోరుగా అమ్ముడయ్యాయి. వివిధ రకాల ఆఫర్లతో బాణసంచా దుకాణదారులు వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే బుధవారం పూర్తిస్థాయిలో ప్రజలు మందు గుండు సామగ్రి కొనుగోలు చేయనున్నారు. అయితే బాణసంచా ధరలు బాంబుల్లా పేలుతున్నాయి. రూ.3 నుంచి రూ. 6 వేలు పెట్టినా కుటుంబానికి సరిపడా మందుగుండు సామగ్రి రాని పరిస్థితి ముంది. మరోవైపు నిత్యావసర సరకుల ధరలు కూడా ఆకాశాన్ని అంటడం..దీపావళి నెలాఖరులో రావడంతో పండగ మరింత ప్రియంగా మారిందని పేద, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

30 స్టాళ్ల ఏర్పాటు

స్థానిక నక్కవానిపాలెం వద్ద బాణసంచా సామగ్రి విక్రయించే స్టాల్స్ మంగళవారం ఏర్పాటు చేశారు.తొలుత 60వ వార్డు గుల్లలపాలెం వాకర్స్ పార్కులో ఏర్పాటు చేయాలని వ్యాపారులు యోచించారు. అయితే వాకర్స్ క్లబ్ వ్యతిరేకించి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో స్టాల్స్ ఏర్పాటుకు బ్రేక్ పడింది. చేసేది లేక జీవీఎంసీ 58వ వార్డు నక్కవానిపాలెం ఎదురుగా గల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులను తీసుకున్నారు.మంగళ,బుధ, గురువారం మూడు రోజుల పాటు ఇక్కడ సామగ్రి విక్రయాలు జరుగుతాయి.సుమారు 30 దుకాణాలు ఏర్పాటు చేశారు.



నక్కవానిపాలెం వద్ద ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్

ఆశల పల్లకీలో వ్యాపారులు

గతేడాది దీపావళి ముందు రోజున వర్షాలతో సామగ్రి అమ్ముడుపోక వ్యాపారులు నష్టపోయారు. ఆ లోటును ఈ ఏడాది భర్తీ చేసుకోవాలనే ఆశతో ఈ ఏడాది అమ్మకాలకు సిద్ధమయ్యారు. అయితే ధరలు పెరగడంతో వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇదిలా ఉండగా ధరలు పెరిగినా ప్రజలు తప్పనిసరి పరిస్థితిలో పిల్లల కోసం కొనుగోలు చేస్తున్నారు.

అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి

మల్కాపురం: ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం చేయాలని చూస్తుందని సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు ఆవేదన వ్యక్తం చేశారు. క్యూబాపై అమెరికా ఆంక్షలను ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ క్యూబాకు సంఘీభావంగా సీఐటీయూ మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కె.పెంటారావు మాట్లాడుతూ క్యూబాకు మందులు,ఆహర పదార్థాలను, పెట్రోల్ వంటి సామగ్రి ఇతర దేశాల నుంచి రాకుండా అమెరికా ఆంక్షల పేరిట అడ్డుతగలడం దారుణమన్నారు. కరోనా వంటి కష్టకాలంలో క్యూబా వంటి దేశం ప్రపంచ దేశాలకు వైద్యం,డాక్టర్లను అందించిన ఘనత ఆ దేశానిది అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులతో పాటు కార్యకర్తలు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలని నినదిస్తున్న సీఐటీయూ నాయకులు

విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నా నేడు

విశాఖ విద్య: కూటమి ప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలనే డిమాండ్‌తో బుధవారం గోపాలపట్నం, వెంకటాపురం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయాల ముందు ధర్నా చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా సమితి సభ్యులు వై రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పార్టీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలు చేపడతామన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

విశాఖ విద్య: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలోభగవాన్ ధన్వంతరి జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఏడీలోని నాయీబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో ముందుగా ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నరవ పైడిరాజు మాట్లాడుతూ ఆయుర్వేద రంగానికి మొట్టమొదటి వైద్యుడు భగవాన్ శ్రీశ్రీశ్రీ ధన్వంతరి స్వామి ఆశీస్సులు నాయీ బ్రాహ్మణులపై ఉంటాయన్నారు. కార్యక్రమంలో భాగంగా సామాజిక కార్యక్రమాలు చేస్తున్న మల్లువలస రాధాకృష్ణ , సన్నాయిల రాజును సంఘం తరఫున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రేటర్ సిటీ అధ్యక్షుడు ఆతవ సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లపల్లి అప్పలరాజు, రాష్ట్ర కార్యదర్శి కుదిరిల్ల వెంకట్రావు ,వీరేశ్వరపు త్రినాథ్ ,వర్కింగ్ అధ్యక్షుడు చిగురువలస పోలారావు, కందిపప్పు గోవిందు ,మల్లువలస వర్మ తదితరులు పాల్గొన్నారు.



ధన్వంతరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యుత్ చార్జీల పెంపుతో సామాన్యులపై భారం



ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ శ్రేణులు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకగా రూ.6,078 కోట్ల మేర పెంచిన విద్యుత్ చార్జీల వల్ల సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని, తక్షణమే పెంచిన ఛార్జీలు రద్దు చేయాలని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ గురుద్వారా సమీపంలోని ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ సామాన్య కుటుంబాలు, రైతులు, చిన్న వ్యాపారులు ఇప్పటికే ధరల పెరుగుదలతో సతమతమవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు నవంబర్ ఒకటి నుంచి యూనిట్‌కు రూ.1.58ల పెంపు వల్ల వారి జీవనోపాధి మరింత కష్టతరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చార్జీల పెంపుతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 25 లక్షల మంది వినియోగదారులపై అదనంగా రూ.15 కోట్ల భారం పడుతుందని తెలిపారు. చార్జీల పెంపు పారదర్శకంగా లేకపోవడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జనరల్ మేనేజర్ వి.విజయలలితకు సీపీఐ ప్రతినిధి బందం వినతిపత్రం అందజేసింది. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ, జీఎస్‌జే అత్యుతరావు, కె.సత్యనారాయణ, ఎస్కే రెహమాన్, ఎం.మన్మథరావు, ఆర్.శ్రీనివాసరావు, సీఎస్ క్షేత్రపాల్ రెడ్డి, ఎంఏ బేగం, కె.వనజాక్షి, ఎ.దేముడమ్మ, బి.పుష్పలత, కె.అచ్యుతరావు, వై.రాంబాబు, ఎస్.అప్పన్న, కె.లక్ష్మణరావు, సీహెచ్ కాసుబాబు, ఎస్.సూరిబాబు, ఎం.శ్రీనివాసరావు, ఎ.రవి, జి.కాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

తాటిచెట్లపాలెం: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయి ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాకు చెందిన అనిల్ మచ్చను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి తరలించేందుకు రెక్కీ నిర్వహిస్తుండగా ఆర్పీఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని జీఆర్పీ సిబ్బందికి అప్పగించారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

ఇటు చీకటి.. అటు వెలుగులు..!

- అవసరమైనచోట వెలగని విద్యుత్ లైట్లు
- కొన్నిచోట్ల నెల రోజులుగా పగలూ వెలుగులే..!
- అధికారుల నిర్లక్ష్యంతో 56, 57వ వార్డు ప్రజలకు అవస్థలు



సుభాష్‌నగర్‌లో విద్యుత్ దీపాలు వెలగక అలుముకున్న చీకటి



గౌరీనగర్‌లో పగలు వెలుగుతున్న విద్యుత్ దీపం

కంచరపాలెం : జీవీఎంసీ 56, 57వ వార్డు కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్ సచివాలయ పరిధిలో సుభాషనగర్, తుమ్మడపాలెం ప్రాంతాల్లో అంధకారం రాజ్యమేలుతోంది. స్తంభాలకు దీపాలు లేకపోవడం, మరికొన్ని చోట్ల లైట్లు పనిచేయకపోవడంతో ఆయా కాలనీల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. గత 10 రోజులుగా లైట్లు వెలగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్తంభాలకున్న లైట్లు సక్రమంగా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా చీకటిలో దొంగలు, ఆకతాయిలు చెలరేగిపోతున్నారని వాపోతున్నారు. కొన్నిచోట్ల బైకుల్లోని పెట్రోల్ అపహరించుకుపోతున్నారని మండిపడుతున్నారు. గత నెలలో కురిసిన వర్షాలు, గాలుల వల్ల విద్యుత్ దీపాల వైర్లు తెగిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ చీకటిలో ఆ వీధుల్లో రాకపోకలకు పాదచారులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు గౌరీనగర్, గోకుల్ నగర్, దుర్గానగర్ రైల్వే ట్రాక్ రహదారి ప్రాంతాల్లో గత పక్షం రోజులుగా విద్యుత్ లైట్లు పగలు రాత్రి అన్న తేడా లేకుండా 24 గంటలూ వెలుగుతుండడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో విద్యుత్ దీపాల సమస్యపై జీవీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.



ఊర్వశి కూడలిలో పగలు వెలుగుతున్న వీధిలైట్

అధికారుల నిర్లక్ష్యం వల్లే...

పగటి పూట విద్యుత్ లైట్లు వెలుగుతున్నా అధికారులు, సిబ్బంది పర్యవేక్షించడం లేదు. గతంలో ఇలాంటి సమస్యలపై సచివాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించేవారు. కొన్ని ప్రాంతాల్లో 24 గంటలు విద్యుత్ స్తంభాలకు లైట్లు వెలుగుతుంటే మరికొన్ని ప్రాంతాల్లో స్తంభాలకు లైట్లే కనిపించడం లేదు. చీకటి రహదారుల్లో రాకపోకలు సాగిస్తున్నాం.

– ఆర్.శ్రీనివాసరావు, ఊర్వశి కూడలి

అధికారులు స్పందించాలి

విద్యుత్ లైట్ల నిర్వహణలో కాంట్రాక్ట్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పగలు నిత్యం వెలుగులు విరజిమ్ముతున్నా... రాత్రి వేళ చీకట్లు కమ్ముకున్నా పట్టించుకోనే నాథుడు కనిపించడం లేదు. చీకటిలో ఆకతాయిలు, పెట్రోల్ దొంగలు చెలరేగిపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షించి సమస్య పరిష్కరించాలి.

– యల్లపు ఝాన్సీలక్ష్మి, కంచరపాలెం

బీచ్‌రోడ్డులో విజిలెన్స్ వారోత్సవాలు

ఏయూక్యాంపస్: విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఆర్కే బీచ్ వద్ద సీబీఐ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్.పి మురళీ లాంబ విచ్చేసి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్లకార్డులు చేతబూని అవినీతికి దూరంగా ఉండాలని, అవినీతిని ప్రోత్సహించరాదని, అవినీతిని నిర్మూలించాలని నినాదాలు చేశారు. అనంతరం బీచ్‌రోడ్డులో కరపత్రాలను పంపిణీ చేశారు. ఓరియంటల్ ఇన్సూరెన్స్ సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ జరిపారు. ర్యాలీలో సంస్థ డీజీఎం కె.కోటేశ్వర రావు, ఆర్ఎం పి.సతీష్ బాబు, టి.టి.వి రామం, మేనేజర్ ఎన్. రామానుజన్, విజిలెన్స్ అధికారి ఎస్.ఎస్.కె మోహన రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న సీబీఐ సిబ్బంది